ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
13 మే
2025



# ఫీజు నియంత్రణ కమిటీకి సూచనలు చేసిన ట్రస్మా

**బడ్జెట్ ప్రైవేట్ స్కూల్స్ చేస్తున్న విద్యా సేవను మంత్రి శ్రీధర్ బాబుకు వివరించిన ట్రస్మా**

**స్కూల్స్ అన్నింటినీ ఒకే కేటగిరీలో చూడొద్దని వినతి**





హైదరాబాద్, రోమింగ్ న్యూస్: ప్రైవేట్ పాఠశాలల ఫీజు నియంత్రణపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీతో ట్రస్మా ప్రతినిధులు సమావేశమయ్యారు. బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు మరియు జూనియర్ కాలేజీలలో ఫీజు నియంత్రణపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సచివాలయంలో నిర్వహించిన కీలక సమావేశానికి ట్రస్మా ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు. ఈ సమావేశానికి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. తెలంగాణ ప్రైవేట్ స్కూల్స్ మరియు జూనియర్ కాలేజీల ఫీజు రెగ్యులేటరీ మరియు మానిటరింగ్ కమిషన్ డ్రాఫ్ట్ బిల్ 2025”పై చర్చించారు.

RTE చట్టం 21(1) (c) ప్రకారం – ప్రైవేట్ పాఠశాలల్లో 25% విద్యార్థులకు ఫీజు భర్తీ అమలు సాధ్యసాధ్యాలపై ప్రెస్మ ప్రతినిధుల సమాచారాన్ని తీసుకున్నారు. రాష్ట్రంలో సుమారు 10,000కు పైగా బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను ప్రాతినిధ్యం వహిస్తున్న ట్రస్మా బృందం, డ్రాఫ్ట్ బిల్‌పై అభ్యంతరాలు, వాస్తవిక సవాళ్లు మరియు సానుకూల ప్రతిపాదనలు సమర్పిస్తూ రెండు గంటల పాటు సమగ్ర ప్రెజెంటేషన్ ఇచ్చింది. బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టే ముందు పునఃసమీక్షించాలని కమిటీని కోరుతూ వ్రాతపూర్వక నివేదికను సమర్పించింది. మంత్రివర్యులు శ్రీధర్ బాబు గారు ట్రస్మా ప్రతినిధుల అభిప్రాయాలను సానుకూలంగా స్వీకరించారు. మరియు ప్రతిపాదనలపై సమగ్రంగా పునఃపరిశీలన చేస్తామన్నారు. ఈ

**సమావేశానికి హాజరైన అధికారులు:**

యోగితా రాణా – ఎడ్యుకేషన్ సెక్రటరీ
శ్రీ నర్సింహ రెడ్డి – పాఠశాల విద్యా డైరెక్టర్
దేవసేన – టెక్నికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్

ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రధాన కార్యదర్శి ఎన్.రమేష్ రావు, ట్రెజరర్ రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు పల్లె వినయ్ కుమార్ గౌడ్, ఎస్.ఎన్. రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మైనారిటీ మరియు క్రైస్తవ పాఠశాలల ప్రతినిధులు ట్రస్మా ఎన్నికల కమిటీ ఛైర్మన్ నారాయణ రెడ్డి మరియు ట్రస్మా జాతీయ సలహాదారుడు మరియు పర్యావరణ అభివృద్ధి మండలి జాతీయ సలహాదారుడు కొమటిరెడ్డి గోపాల్ రెడ్డి కీలక సూచనలు చేశారు. ఆయన ముఖ్యంగా ఈ అంశాలను ప్రస్తావించారు:

ఫీజు నియంత్రణకు ముందు పాఠశాలల వర్గీకరణ జరగాలనీ, 5వ తరగతి మరియు 8వ తరగతులలో పబ్లిక్ పరీక్షలు అమలు చేయాలని కోరారు.

పర్యావరణ విద్యను చిన్నతనం నుంచే పాఠ్యాంశాలలో భాగం చేయాలనీ గోపాల్ రెడ్డి సూచించారు. సూచనలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యా దృష్టికోణానికి అనుగుణంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.

బిల్లుపై సమగ్ర నివేదికను త్వరలో సభ్యులకు పంపిణీ చేయడం జరుగుతుందనీ అధికారులు తెలిపారు.

# యాదగిరిగుట్టను మోడల్ మున్సిపాలిటీగా డెవలప్ చేస్తా

**- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట పట్టణాన్ని మోడల్ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పలు వార్డుల్లో పర్యటించారు. కాలినడకన గల్లీ గల్లీ తిరిగి రోడ్ల సమస్యలు, డ్రైనేజీ సమస్యలను తెలుసుకున్నారు. గాంధీ విగ్రహం నుండి యాదగిరిపల్లి వరకు ఏర్పాటు చేస్తున్న రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాదగిరిగుట్ట మున్సిపాలిటీని ఆదర్శ పట్టణంగా డెవలప్ చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా రోడ్లు, అండర్ డ్రైనేజీ, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని తెలిపారు. శాశ్వత ప్రాతిపదికన తాగునీటి సమస్యను తీర్చడం కోసం అమృత్ 2.0 పథకం కింద మూడు పెద్ద వాటర్ ట్యాంక్ లను ఏర్పాటు చేస్తున్నామని, వాటి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి దేశ నలుమూలల నుండి వచ్చే భక్తులతో పాటు స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదనే సదుద్దేశంతో.. ముందుచూపుతో ప్రత్యేక ప్రణాళికలతో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ప్రత్యేక నిధులు కేటాయించి యాదగిరిగుట్ట మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భరత్ గౌడ్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ ఆంజనేయులు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బిక్షపతి, మున్సిపల్ కమిషనర్ అజయ్ కుమార్ రెడ్డి, ఐఎన్టీయూసీ అధ్యక్షుడు జీవన్ రెడ్డి, మండల నాయకుడు హేమేందర్ గౌడ్, నాయకులు హరీష్, కాంగ్రెస్ సోషల్ మీడియా కన్వీనర్ నరేష్ తదితరులు ఉన్నారు.





## నారసింహుడి సేవలో పలువురు ప్రముఖులు

**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ చల్లా గుణరంజన్ వారి ఫ్యామిలీలతో కలిసి వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. మొదట ఆలయానికి వచ్చిన వారికి ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో ఆలయ ఉప ప్రధానార్చకులు మాధవాచార్యులు వారికి వేదాశీర్వచనం చేయగా.. ఆలయ సూపరింటెండెంట్ రాజన్ బాబు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.

# జాగో హిందూ జాగో...

**జనగామలో హిందూ బాల సంస్కార శిక్షణ**



జనగామ,మే 12: (రోమింగ్ న్యూస్) : హిందువులంతా ఐక్యంగా ఉంటూ అమాయకత్వాన్ని వదిలి జాగృతము అవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ లక్ష్యంతో జనగామలో చిన్నపిల్లలకు ఆధ్యాత్మిక, ధార్మిక, చారిత్రక అంశాల బోధన చేస్తూ సోమవారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శిబిర నిర్వాహకులు డాక్టర్ మోహన్ కృష్ణ భార్గవ మాట్లాడుతూ చైతన్యవంతనైన హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో హిందూ బాల సంస్కార శిక్షణ శిబిరాన్ని జిల్లా కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శిక్షణ తరగతులను ఏర్పాటు చేసారు. ప్రముఖ కవి, అధ్యాపకులు గంగరాజు శ్రీనివాస్ రావ్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చైతన్యవంతమైన హిందూ సమాజ నిర్మాణమే లక్ష్యంగా బాల్య దశలోనే పిల్లలను ఆదర్శవంతమైన, సంస్కారవంతమైన భవిష్యత్తు వైపు నడిపించేందుకు ఆధ్యాత్మిక, ధార్మిక, చారిత్రక అంశాలతో అనేక శ్లోకాలు, స్తోత్రాలు, కీర్తనలు, సుభాషితాలు వంటి ఆసక్తికర ప్రణాళికతో ప్రతీ రోజు ఒక ప్రత్యేక వక్త అతిథిగా పాల్గొని నూతన అంశాలను, అనేక విషయాలను బోధించనున్నారని తెలిపారు. భవిష్యత్ తరాన్ని పటిష్ఠపరచేందుకు, హిందూ సమాజ చైతన్యం కోసం విద్యార్థి దశలోనే బీజం వేయడం అద్భుత ప్రణాళిక అని అన్నారు. రాముడు లాగ ఆదర్శంగా, ధర్మనిష్టా పరులుగా ఎదగాలని అన్నారు. సనాతన సాంప్రదాయాలను, సంస్కృతులను కాపాడుకోవాలని తెలిపారు. దేవాలయ గౌరవాధ్యక్షులు గజ్జెల నర్సిరెడ్డి మాట్లాడుతూ ఇటువంటి అద్భుత కార్యక్రమంలో తమ పిల్లలందరూ తప్పకుండా పాల్గొనేలా ప్రయత్నించాలని తల్లిదండ్రులను కోరారు. పాల్గొన్న విద్యార్థులు తప్పకుండా విషయాలను నేర్చుకొని, జీవితంలో విజయాన్ని సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. ఈ తరగతుల్లో వేముల సదానందం “హిందూ సంస్కృతీ, సాంప్రదాయాలు, మన ప్రాచీన వైభవం, ధర్మ విశిష్టత” అనే అంశంపై ప్రసంగించారు. నిర్వహాకులు చిలువేరు హర్షవర్ధన్, ఉల్లెంగుల రాజు, మైలారం శ్రీనివాస్, సాయికుమార్, యెలసాని కృష్ణమూర్తి, రాంబాబు, అంబటి బాలరాజు ఇట్టబోయిన రాజు, అశోక్, అన్నెబోయిన, సత్యం తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా వేంకటగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

**కల్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ మల్లన్న**



**యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:** యాదాద్రి జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురంలో కొండపై కొలువై ఉన్న వేంకటగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు రమాకాంత్ శర్మ అర్చకత్వంలో అర్చకులు స్వామిఅమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని నయనానందకరంగా నిర్వహించారు. అనాదిగా వస్తున్న సంప్రదాయం ప్రకారం యాదగిరిగుట్ట టెంపుల్ తరఫున ఛైర్మన్ నరసింహమూర్తి స్వామివారికి పట్టువస్త్రాలు, అమ్మవారికి ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. భక్తజన సందోహం మధ్య స్వామిఅమ్మవార్ల కల్యాణాన్ని స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా, కన్నులపండువగా జరిపారు. లోక కల్యాణం కోసం స్వామివారు అమ్మవారి మెడలో మంగళసూత్రం కట్టే తంతును వైభవోపేతంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరులో వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ముల్లోకాది దేవతలు చూస్తుండగా నరసింహస్వామి అమ్మవారి మెడలో తాళి కట్టే ఘట్టాన్ని అర్చకులు అద్భుతమైన రీతిలో ఆవిష్కరింపజేశారు. లక్ష్మీనరసింహుల కల్యాణంలో పాల్గొన్న భక్తులు, తమ జన్మ ధన్యమైందంటూ పరవశించిపోయారు. యాదరుషి తపస్సుతో నరసింహస్వామి వెంకటాపురంలో యోగానంద నరసింహుడిగా వెలిశారని, వేంకటగిరి లక్ష్మీసమేత నారసింహుడిని దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని అర్చకులు భక్తులకు ప్రవచించారు. అందుకే ఈ క్షేత్రాన్ని నరసింహుడి పుట్టినిల్లు అని, యాదగిరిగుట్టలోని పాతగుట్ట నృసింహుడి విడిది అని, ప్రస్తుత యాదగిరిగుట్ట టెంపుల్ భక్తుల సౌకర్యార్థం వెలిసిన క్షేత్రమని పురాణాలు చెప్తున్నాయని అర్చకులు ప్రవచించారు.

**కల్యాణంలో పాల్గొన్న విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ మల్లన్న**

వేంకటగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్యే బిక్షమయ్య గౌడ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనిత దంపతులు స్వామివారి కల్యాణం సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలేరు ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించామని తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని స్వామివారిని కోరానని చెప్పారు. ఈ కార్యక్రమంలో మదర్ డెయిరీ ఛైర్మన్ మధుసూదన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కల్లూరి ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్ గౌడ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# కాచారం వీవోఏను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

**యాదగిరిగుట్టలో మండల మహిళా సమాఖ్య ఆఫీస్ ఎదుట వీవోఏల ధర్నా**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఎలాంటి తప్పు చేయకున్నా విధుల నుంచి తొలగించిన కాచారం వీవోఏ సంధ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని వీవోఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారుల తీరును నిరసిస్తూ.. సోమవారం యాదగిరిగుట్టలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయం ఎదుట వీవోఏలు ధర్నా నిర్వహించారు. కాచారం వీవోఏ సంధ్యకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీఎం సుధాకర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వీవోఏల సంఘం జిల్లా అధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ.. కాచారం వీవోఏ సంధ్య ఎలాంటి అవినీతికి పాల్పడలేదని విచారణలో తేలినా విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ కక్షతోనే అధికార పార్టీ నాయకులు తమ పలుకుబడి ఉపయోగించి వీవోఏ సంధ్యను విధుల నుంచి తొలగించారని ఆరోపించారు. విధుల నుంచి ఎందుకు తొలగించారని అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పడం లేదని మండిపడ్డారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా విధుల నుంచి తొలగించే అధికారం ఏ అధికారికి ఉండదని, అలాంటిది కనీసం ఒక్క నోటీసు కూడా ఇవ్వకుండా ఏకంగా విధుల నుంచి తొలగించడమేంటని ప్రశ్నించారు. రాజకీయ ఒత్తిడులతో అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా రాజకీయ ఒత్తిడులకు లొంగకుండా అధికారులు తమ వైఖరిని మార్చుకుని కాచారం వీవోఏ సంధ్యను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**తప్పని పరిస్థితుల్లో తొలగించాల్సి వచ్చింది : ఏపీఎం సుధాకర్**

కాచారం వీవోఏ సంధ్య మహిళా సంఘాలకు లోన్లు ఇప్పించే క్రమంలో అక్రమాలకు పాల్పడుతున్నారని సదరు మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఫిర్యాదు చేయడంతో.. నిజానిజాలు తేల్చాలని ఆదేశించడంతో గ్రామంలోకి వెళ్ళి విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించానని ఏపీఎం సుధాకర్ తెలిపారు. విచారణలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వీవోఏ సంధ్య చిన్న చిన్న పొరపాట్లు తప్ప ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని తేలిందని, కానీ తప్పని పరిస్థితుల్లో ఆమెను విధుల నుంచి తొలగించాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. అదేంటని మీడియా ప్రశ్నించగా.. కొన్ని బయటకు చెప్పుకోలేని పరిస్థితుల కారణంగా ఉన్నతాధికారుల ఆదేశాలు లేకున్నా వీవోఏ సంధ్యను విధుల నుంచి తొలగించాల్సి వచ్చిందని తెలిపారు. వీవోఏ సంధ్య తప్పు చేయలేదని, ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా విధుల నుంచి ఎలా తొలగిస్తారని ప్రశ్నించగా.. సరైన సమాధానం ఇవ్వకుండా దాటవేశారు.

# యాదగిరిగుట్టపై ‘చందమామ’ అందాలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరిగుట్ట ప్రధానాలయంపై సోమవారం ‘చందమామ’ అందాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జయంతి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక లైటింగ్ తో స్వర్ణవర్ణంలో మెరిసిపోతున్న సప్తగోపుర ప్రధానాలయ సముదాయానికి చందమామ పౌర్ణమి అందాలు సరికొత్త శోభనిచ్చాయి. స్వర్ణమయ ప్రధానాలయ అందాలకు తోడు పౌర్ణమి చంద్రుడి వెలుగులు జత కావడంతో.. భక్తులతో పాటు స్థానికులు సైతం మంత్రముగ్ధులయ్యారు. పౌర్ణమి సందర్భంగా నిండు చంద్రుడు స్వామివారి ప్రధానాలయం మీదుగా ప్రకాశిస్తున్న సమయంలో.. అట్టి అందాల దృశ్యాలు కెమెరా కంటికి చిక్కాయి. స్వర్ణకాంతులతో మిరుమిట్లు గొలుపుతున్న ప్రధానాలయంపై నిండు చంద్రుడి కాంతులు భక్తులను విపరీతంగా ఆకర్శించాయి. స్వామివారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులు ఇట్టి సుందర దృశ్యాలను తమ సెల్ ఫోన్ లలో బంధించి సెల్ఫీలు కూడా తీసుకుని తరించారు. దాదాపుగా రెండు గంటల పాటు ఈ సువర్ణ సుందర దృశ్యాలు భక్తులను కనువిందు చేసింది.



